# బాండెడ్ లేబర్

పాలకోడేటి సత్యనారాయణరావు

అన్నపూర్ణ ఇల్లు చేరేసరికి ఆరుకు ఆరు నిమిషాలు తక్కువ ఉంది.

మధ్యాహ్నం అంతా కురిసి వెలిసిన వర్షం ఇంకా రోడ్డుమీద గుంటల్లో కులాసాగా కాపురం చేస్తూనే ఉంది. మధ్యాహ్నం కురుద్దామనుకొని కొంచెం ఆలోచించి ఇపుడు పడుతున్న చిన్నచిన్న చినుకులు అపుడొకటి అపుడొకటిగా ఆ వాన గుంటల్లో పడి తమ వ్యక్తిత్వాన్ని సమూహబలంగా మార్చుకొంటున్నాయి. ఎక్కడా ఏ పక్షీ ఎగరటంలేదు. అన్నీ— తడిసిన తమ రెక్కల్ని ఆరబెట్టుకొంటూనో లేకపోతే తడవని తమ రెక్కల్ని తమ గూళ్లల్లో జాగ్రత్తగా దాచుకొనే యత్నమో చేసుకొంటున్నట్లున్నాయి.

ఇంటికొచ్చాక అన్నపూర్ణ వంటి మీద నుంచి రెయిన్‌కోటు తీసి హాంగర్‌కు తగిల్చింది. రెయిన్‌కోటు మీదనుంచి చిన్నచిన్న బిందువులు నెమ్మదిగా కిందకు జారుతున్నాయి.

తడవని తలను ఒకసారి తువ్వాలుతో తుడుచుకొంది. ఆ తర్వాత నెమ్మదిగా వంట ఇంట్లోకి వెళ్ళి చూసింది. గిన్నెలో పాలు గిన్నెలోనే ఉన్నాయి. అంటే ఈ రోజు పిల్లికూడా కాలు కదపలేదన్నమాట! అందుకే ఇంట్లో పాలు ఇంట్లోనే ఉన్నాయి. ఆయనొస్తే.... అనుకొంది అన్నపూర్ణ.

ఆరూపది దాటింది.

బాల్కనీలోంచి బయటకు చూసింది అన్నపూర్ణ. వర్షాకాలం కావటంవల్ల అపుడే చీకట్లు ముసురుకొంటున్నాయి. అయినా, ఆయన ఇంకా రాలేదు.


'ఏం జీవితమో!' అనుకొందొకసారి అన్నపూర్ణ.

జీవితాన్ని వెనక్కు తిరిగి చూసుకొంటే మిగిలింది ఏదీ కనపడదు అన్నపూర్ణకు. గానుగెద్దు జీవితం. చదువుకొంటున్న రోజులలో ఎంత ఆనందం అనుభవించటం జరిగిందో అంతే! ఏదో కొంత చదివాక మరికొంత పైకిపోదామంటే ఆర్థికమైన ఇబ్బందులవల్ల ప్రతి అడుగూ కుంటుపడిపోయింది. అందలేని ఆకాశాలకు ఎగరటంకన్నా అందిన పళ్ళే చాలనుకొంది. చేతికొచ్చిన డిగ్రీతో ఎదుగూ బొదుగూ ఉండని ఉద్యోగం సైతం అందుకో గలిగింది. బహుశా ఏ ఆడదీ ఇంతకన్నా ఇంకేమీ కోరదేమో!

—కానీ, అన్నపూర్ణ వేరు. ఆమె ఆశలు వేరు, జీవితం వేరు కావాలనుకొంది.

ఆడది—చదువుకొన్న ఆడది అయితే మరీ ప్రమాదకరమైన వస్తువు. అందుకే ఆడది ఎక్కడ ఎదిగిపోతుందోనన్న భయంతో ఎదగగలిగే అవకాశం ఇవ్వకనే మానసికంగా కొంచెం తలఎత్తే సమయానికి పెళ్ళిచేసేస్తే ఆడదానికి జీవితం

ఒరిజినల్ కురుక్షేత్ర ప్రదర్శనం!




ఆఖరు. అక్కడినుంచి ఆడది పూర్తి స్వార్థపరురాలిగా మారిపోయి, తనచుట్టూ ఓ గిరి గీసుకొని నత్తబతుకు ప్రారంభిస్తుంది.

అన్నపూర్ణ జీవితమూ ఇలాగే గడిచింది. ఉద్యోగం దొరికాక, కొంచెం చుట్టూ పరిస్థితులు అవగాహన చేసుకోబోయే సరికి, వద్దంటున్నా వినక, ఇంట్లో వాళ్లు పెళ్ళిచేసేసారు. అన్నపూర్ణ కూడా పెళ్ళయిన ఆ కొత్త మోజులోంచి కొంచెం తెరిపిన పడబోయేసరికి, ఏముందీ, జీవితంలో అన్నీ అడ్డంకులే. ఆడపిల్లై పుట్టాక అది ప్రకృతి ఇచ్చేవరమా, వేసేశాపమా? ఆ తొమ్మిదినెలల 'ఇంప్రిజన్‌మెంట్' అయ్యాక మళ్ళీ వెంగళప్ప బతుకు!— ఇల్లు. మొగుడు.. పిల్లలు జీవిత నాటానికి ఇది ఒకవేపు అయితే, ఆఫీసు, ఆఫీసరు ఫైళ్ళు ఇది రెండోవైపు.

ఒకటే తేడా — ఇంట్లో పిల్లల్ని తను కంటుంది. ఆఫీసులో ఫైళ్ళను ఎవరూ కననక్కర్లేదు. వాటంతట అవే వరుసగా పొదుగుకొంటూ పోతాయి.

ఇంకో తేడా—పిల్లల్ని తనుపెంచాలి. ఫైళ్ళు తన్నుపెంచుతాయి, ఆర్థికంగా! స్వతహాగా ఏమీ ఆలోచనే అవసరంలేదని చెబుతున్న రూల్సు అన్నీ మానసికంగా అందర్నీ ఎప్పుడో చంపేస్తాయి. మనిషిని చంపితే హత్య. మనిషి ఆలోచనల్ని చంపితే ?—ఏమో! దీన్ని హత్య అనకూడదేమో!

పరాయి ఆలోచనలతో పగలంతా పనికి

రాని జీవితం గడిపాక, అయిదింటికి కొంచెంసేపు స్వేచ్ఛ. ఆ తర్వాత బస్సు దొరికి ఇంటికి వచ్చేసరికి, బస్‌స్టాపులోనూ ఆ తర్వాత బస్సులోనూ నిలబడటంతో ఒళ్ళంతా హూనం అయిపోవటం, మళ్ళీ మామూలు జీవితం! ఏమిటి సాధిస్తున్నట్లు తనూ, తనలాటి మిగతా అందరూ??

ఎవరికీ తెలీదు.

గమ్యం తెలీని, లక్ష్యంలేని దౌర్భాగ్యపు బ్రతుకులు. కానీ అందరికి అందరూ ఏదో సాధిస్తున్నట్లుగా పోజు!

అన్నపూర్ణ ఆలోచనలు అన్నీ అలా ఉన్నప్పుడు తలుపు చప్పుడయింది. వెళ్ళి తీసింది. ఎదురుగా రాజగోపాల్! నవ్వుతూ భర్తకు దారిచ్చింది.

"పూర్ణా, కొంచెం కాఫీ .."

"ఓయస్, మీరు బట్టలు మార్చివస్తే.. మీకోసమే ఎదురు చూస్తున్నా!" అంటూ వంట ఇంట్లోకి వెళ్ళింది.

అయిదు నిమిషాల తర్వాత కాఫీ తాగటం పూర్తి చేసేసరికి పిల్లలు ముగ్గురూ బిలబిలమంటూ తయారు అయారు.

"ఏం చదివార్రా ఈ రోజు?" అనడిగింది అన్నపూర్ణ.

పెద్దవాడు డిప్లమాటిక్‌గా నవ్వి ఊరుకొంటే, చిన్నవాడు మాత్రం "మహిళాభ్యుదయం అనేపారం చదివానే!"అన్నాడు

రాజగోపాల్‌కు నవ్వొచ్చింది. "ఎంత వరకూ వచ్చింది?"

"చివరవరకూ! ." అన్నాడు వాడు అమాయకంగా.

"చివర వరకూ కాదురా, వంటింటి వరకూ!" ఈసారి నవ్వుల్లో అన్నపూర్ణా పాలు పంచుకొంది.

పిల్లలందరూ పుస్తకాలు సర్దుకొంటూంటే, అన్నపూర్ణకో క్షణం గాలి పీల్చుకోవటానికి తీరికదొరికింది. గాలి పీల్చుకోవటంకన్నా, ఆ రోజు ప్రపంచంలో ఏమూల ఏం జరిగిందో, ఏ దేశంలో ఎవరెవరు ఎలా మేల్కొ-గలుగుతున్నారో తెలుసుకోవటం అంటే అన్నపూర్ణకు ఇష్టం. అందుకే రోజూ పేపరుకొంటొంది. కానీ చదవటంమాత్రం రోజూ రాత్రిపూటే!

పేపరు అందుకొని మడతలు విప్పే లోగానే పెద్దవాడు దగ్గరజేరి అన్నాడు—

"అమ్మా, ఆకలేస్తోందే!"

పేపరు అక్కడపడేసి లేచి అన్నం పెట్టింది. ఆ యజ్ఞం అయేసరికి ఎనిమిది అయింది అని రేడియో చెప్పింది.

"పిల్లల్ని పడుకోబెట్టిరా పూర్ణా, మనమూ భోజనం చేద్దాం!" అన్నాడు రాజగోపాల్.

"ఇంతక్రితమే చెప్పి ఉంటే కలిసి తినేవాళ్ళంగదా!" అంది కొంచెంవిసుగ్గానే.

"మనం ఇప్పుడేగా కాఫీతాగాం. అందుకే, ఇంకో అరగంటైనా, సరేలే!"

పిల్లలకు పక్కవేసి పడుకోబెడుతోంటే రెండోవాడు అన్నాడు. "అమ్మా నాకో రెండు లెక్కలు చేసిపెట్టవే!"

అన్నపూర్ణకు నవ్వొచ్చింది-"లెక్కలు చెయ్యాల్సింది నేనుకాదురా, నువ్వు! లే ఎలా చెయ్యాలో చెబుతాను!" అంటూ వాణ్ణిలేపి, ఆ లెక్కలు రెండూ చెయ్యటం నేర్పింది.

"ఇంకా ఏమైనా ఉన్నాయా?" అనడిగింది అన్నపూర్ణ.

"ఉన్నాయిగానీ రేపు చెబుదువుగాన్లే

ఒరిజినల్ కురుక్షేత్ర ప్రదర్శనం!




నిద్రొస్తోంది!" అన్నాడు నిద్రపోయే కార్య క్రమంలోకి దిగుతూ.

అన్నపూర్ణ గదిలోలైటు ఆర్పి, నైట్ స్టార్ ఆన్‌చేసి వచ్చింది. నైట్‌స్టార్ ఆన్ చెయ్యగానే పిల్లలు లైసెన్స్ ఇచ్చినట్లు కధలు చెప్పుకోవటం ప్రారంభించారు.

నవ్వుతూ అంది అన్నపూర్ణ బయట కొచ్చాక "లైటుంటే చదువుకోవాలని, నిద్రవస్తోందని చెప్పి ఇప్పుడు కధలు చెప్పుకొంటున్నారు!"

"నువ్వు అలా తయారు చేశావన్న మాట!" రాజగోపాల్ నవ్వుతూఅన్నాడు.

"బాగానే ఉంది! పిల్లల్ని ఎలా తయారు చేయాలన్నా నాకు అసలు టైం అంటూ ఉంటేకదా!"

"ఏం, రోజులో ఇరవై నాలుగ్గంటలు అందరికీ ఉండేవేగా!"

"ఆ, నాకింత అదృష్టం కూడానూ?" అంది అన్నపూర్ణ "రండి భోజనంచేద్దాం!"

రాజగోపాల్ పేపరు కింద పడేశాడు.

వడ్డిస్తూ అడిగింది అన్నపూర్ణ, "ఏమిటి విశేషాలు పేపర్లో?"

"ఏమీలేవు."

"పన్నెండు పేజీల పేపర్లో వార్తలే లేవా?"

"ఏమీలేవు! నువ్వో చదువుతావుగా!" అన్నాడు రాజగోపాల్.

"నిజమే, చదవబోతూ కూడామిమ్మల్ని అడగటం నాదేతప్పు!" అంది అన్నపూర్ణ.

పక్కింటి రేడియో తొమ్మిది అయిం దనేసరికి వీళ్ళు భోజనం పూర్తి చేశారు. రాజగోపాల్ విలాసంగా పక్కమీద పడు

కొంది తాంబూలం అందించింది. తాంబూలంతో బాటుగా అన్నపూర్ణనూ అందుకొన్నాడు రాజగోపాల్.

"వదలండీ— వంటఇంట్లో పనంతా అలాగే ఉంది!"

"రోజూ ఉండే పనేగా?"

"ఏది, అదా, ఇదా?" నవ్వేస్తూ అడిగింది అన్నపూర్ణ. అన్నపూర్ణకు అడ్డుపడటానికి కూడా వీల్లేకుండా అయిపోయింది.

* * *

ఒళ్ళంతా 'పడుకొని విశ్రాంతి తీసుకొమ్మంటు'న్నా మళ్ళీ రేపయినా చేసుకోవాల్సిందే గదా అనుకొంటూ పక్కమీద నుంచి లేచింది అన్నపూర్ణ.

పక్కనే భర్త రాజగోపాల్ నిశ్చింతగా నిద్రపోతున్నాడు. బట్టలన్నీ సర్దుకొని, భర్త ఒంటిమీదకు దుప్పటీకప్పి, వంట ఇంట్లోకి నడచింది.

కంచాలన్నీ ఎత్తేసి, గిన్నెలన్నీ సర్దుకొని, తడిగుడ్డతో ఇల్లుతుడిచి, చిన్న చెంబుతో మంచినీళ్ళు తీసుకొని, రెండో చేత్తో టేబిల్ మీద పేపరు అందుకొని, గదిలోకి వచ్చింది.

లైటు వేసింది.

పిల్లల్లో ఎవరిమీదా దుప్పటి సరిగ్గా లేదు. దుప్పటీతీసి మళ్ళీ సరిగ్గా కప్పింది.

గడియారంకేసి చూస్తే పదింబావు అవుతోంది.

పక్కమీదకు వాలి పేపరు అందుకొంది. పేపర్లో పెద్ద అక్షరాలతో ఉన్నవార్తలు ఆమెను ఆదరంగా పలకరించాయి.

అన్నపూర్ణ ఉలికిపడింది ఆవార్తచదివి. ఆశ్చర్యం ఆమెను ఆవరించుకొంటూంటే భర్తను తట్టిలేపింది— "ఏమండోయ్, ఏమండీ"

రాజగోపాల్ కళ్ళు నులుముకొంటూ లేచాడు. "ఏమిటి?"

పేపరు అందించింది.

"చెప్పు ఏమిటో?" అన్నాడు రాజగోపాల్.

"ఇంతమంచివార్త ఉంటే విశేషమేమీ లేదన్నారేం?" అనడిగింది అన్నపూర్ణ.

"ఏమిటా విశేషం?"

"ఇదుగో!" అంటూ అన్నపూర్ణ చూపించిన ఆ వార్తకేసి చూసి, పైకి చదివాడు రాజగోపాల్- "బాండెడ్ లేబర్ ఎబాలిష్డ్ అవును, వెట్టిచాకిరి రద్దయిపోయింది!"

అన్నపూర్ణ పకాలున నవ్వింది. ఆ నవ్వులో రాజగోపాల్‌కు వేయి అర్థాలు కనబడసాగాయి.

ప్రొద్దున్నే అందరికన్నా ముందు నిద్ర లేవటం, వంటచేయటం, పిల్లలకు,తనకూ కావాల్సినవి అమర్చుకోవటం, ఆ తర్వాత ఆఫీసులో, ఆఫీసరు పదాలకు అనుగుణంగా నాట్యం చెయ్యటం, తర్వాత మళ్ళీ ఇల్లు, పిల్లలు మళ్ళీ ఆఫీసు, పైళ్ళు, ఇల్లుపిల్లలూ.

రాజగోపాల్ అన్నపూర్ణకేసి చూశాడు.

అన్నపూర్ణ నవ్వు ఆపుకొంటూ అడిగింది' "నిజమా అని అడుగుతున్నా— బాండెడ్ లేబర్, అదే వెట్టిచాకిరి నిజంగానే రద్దయిపోయిందా? ఎక్కడా?" —

పేపరు పక్కకు పారేసి అన్నపూర్ణను ఆదరంగా దగ్గరకు తీసుకొన్నాడు రాజగోపాల్, అన్నపూర్ణ అంటున్నది విని కూడా, వినిపించుకోనట్లుగా!

పైన వెలుగుతున్న లైటు కూడా— పేపరు చెప్పేది నిజమో, అన్నపూర్ణ అడిగేది నిజమో-ఇంకా నిర్ణయించుకోనట్లుగా వెలుగుతూనే ఉంది గుడ్డిగా!! ***